○○○○○అల్లం శేషగిరిరావు రచన

# స్విచ్ ఆఫ్●●●●●

రామగిరి ట్రావలర్స్ బంగళా ఘాట్ రోడ్ మీద ఉంది. చుట్టూ కొండలు. దట్టమైన అడవి. బంగళాచుట్టూ అడవి గులాబీపొదలు. బంగళాని ఆనుకొని కాఫీ తోటలు. అక్కడక్కడ రబ్బరుచెట్లు, ప్రకృతి రమణీయంగా ఉంది.

డిసెంబరునెల, చాలారాత్రియింది చలి గజగజ వణికించేస్తోంది. బయట వెన్నెల పిండారబోసినట్టుంది, మంచు దట్టంగా పడుతోంది. బంగళా వెనకాల కొండరాళ్లలో నుంచి ఉబుకుతున్న సెల సన్నని ధారగా వెన్నెల్లోపాములా మెలికలు తిరుగుతూ పాకుతూ జారుతోంది.

ఫారెస్టు రేంజరు రంగారావు ఆల్ ఉల్ ఫుల్ స్వెట్టరు తొడుక్కొని రగ్గు కప్పుకొని మంచంమీద దొర్లుతున్నాడు. తలుపులు కిటికీలు మూసుకున్నా చలి దంచేస్తోంది. నిద్ర పట్టడంలేదు. మాట్లాడ్డానికి మంచి మనిషిలేడు. బంగళాలో రెండేరెండు బెడ్‌లు ఉన్నాయి. రెండిటినీ ముందుగానే బుక్ చేసుకున్నాడు రంగారావు ట్రెయినింగులో ఉన్న మరో రేంజరు అనుకోని అవాంతరాలవల్ల తనతో రాలేకపోయాడు. అందువల్ల ఒక బెడ్ ఖాళీగానే ఉండిపోయింది.

సిగరెట్టుమీదసిగరెట్టు కాలుస్తున్నాడు. అప్పుడప్పుడు ఘాట్ రోడ్ మీద వెళ్తున్న లారీల హారన్లు వినిపిస్తున్నాయి. బంగళా ఆవరణలో కుక్కొకటి ఏడుస్తున్నట్లు మోరెత్తి ఉండిండి అరుస్తోంది.

బయట ఎవరో తలుపు కొడుతున్నట్లు స్పష్టంగా వినిపించింది.

రంగారావు తలుపుతీశాడు- చలిగాలి రివ్వున గదిలోకి దూసుకువచ్చింది. ఎదురుగా ఒక వ్యక్తి చలికి గట్టిగా చేతులు కట్టుకొని నిల్చున్నాడు. బ్రీఫ్ కేస్ క్రిందన పెట్టాడు.

"ఎక్స్‌క్యూజ్ మీ, ఖాళీఉందాసార్" అన్నాడు పొలైట్ గా జర్కిన్ జిప్‌ని సవరించుకుంటూ.

"సారీ, బుక్ అయిపోయిందండి" అన్నాడు రంగారావు. క్షణం సేపు డిస్‌ఎపాయింటెడ్‌గా ముఖం పెట్టి శూన్యంలోకి చూస్తూ" బస్సుదొరక్క లారీలో వచ్చాను. అదికూడా మధ్యలో చెడిపోయింది. నడుచుకుంటూ వచ్చేను. తిరిగి రేపటి ఉదయం వరకూ బస్సులేదు" అని నిట్టూర్చాడు.

"అడవి ; రాత్రి - చలిలో ఒంటరిగా పాపం ఎలా ఉంటాడు" కనికరం వేసింది రంగారావుకి.

"ఫరవాలేదు, నా పేరున మరో బెడ్ బుక్ అయిఉంది. ఆ ఆసామీరాలేదు. మీరు ఉండొచ్చు అన్నాడు.

"వెరీకైండ్ ఆఫ్ యూ, చాలా కృతజ్ఞణ్ణి, తెల్లారగట్లే వెళ్ళిపోతాను. షెల్టర్ ఇచ్చి పుణ్యం కట్టుకున్నారు."

"దానికేముందిలెండి. నాకు కూడా ఒంటరిగా బిక్కుబిక్కుమంటూ బోర్ కొట్టేస్తోంది. హాయిగా కప్పుకొని నిద్రపట్టేవరకూ బాతాఖానీ కొట్టొచ్చు...... ఇంకా బయటే ఉన్నారు. ప్లీజ్ కమిన్, చలి ఊపేస్తోంది." అన్నాడు రంగారావు, ఆ ఆసామీ బ్రీఫ్ కేస్ తీసుకొని చాలా హుందాగా పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ లోపలికి వచ్చేడు. సన్నంగా పొడవుగా రివటలా ఉన్నాడు.

"క్షమించాలి, నా పేరు ఎస్. కుమార్, జర్నలిస్టుని, ఈ కొండల్లో, అడవుల్లో ఉన్న కొండజాతివారిని, వారి ఆచార వ్యవహారాల్ని, ఇన్‌హిబిషన్స్‌ని, నేచర్ ఆఫ్ పొలిటికలైజేషన్‌ని అధ్యయనం చెయ్యడానికి మాబ్యూరో పంపింది. పదిహేను రోజులనుంచి వివరాలు సేకరిస్తూ తిరుగుతున్నాను. రేపు ఉదయాన్నే ఇక్కడికీ ఐదు మైళ్ళ దూరంలో గిరిజనుల తండాఉంది - అక్కడికి వెళ్లాలి.

"మాటల్లో మరిచిపోయాను. మీరు సిగరెట్టు వెలిగించండి" అని సిగరెట్టు ఆఫర్ చేశాడు రంగారావు.

"మీరు ప్యూరిటన్నా...... అంటే డ్రింక్‌కి అభ్యంతరం లేదుగదా! అన్నాడు సిగరెట్టు వెలిగిస్తూ.

(తరువాయి 57వ పేజీలో)

(53వ పేజీ తరువాయి)

"గురువుగారూ, నేను ఫారెస్టు రేంజర్ని - మరీ అంత ప్యూరిటన్‌గా ఎలా ఉండగలను".

దట్సాల్ రైట్, మేక్‌డౌల్ విస్కీ తెచ్చేను. కించిత్ సేవిద్దాం......మీరు... అన్నట్టు మీపేరడగడం మర్చిపోయేను"

"రంగారావు"

"రంగారావుగారూ......ఇక్కడ మనకి గ్లాసులు"

"నా సూట్‌కేసులో ఉన్నాయిలెండి" అని సూట్‌కేసుతెరిచి రెండు గ్లాసులు టేబిల్‌మీద పెట్టేడు రంగారావు, కుమార్ రెండుగ్లాసుల్లోనూ రెండేసిపెగ్గులునింపేడు.

"రా కొట్టేద్దామంటారా?... ఇక్కడ సోడా దొరకదు"

"సోడాలకేం ఖర్మండీ. ఇక్కడ ఐస్‌కోల్డ్ వాటరు దొరుకుతోంది. బాత్‌రూమ్‌లో ట్యాప్ ఉంది. దానిలో నీరు ఈచలికి చెయ్యిపెట్టే జివ్వునలాగేస్తోంది. అంత కూలింగ్"

"అలాగా" అని కుమార్ ఎగిరి గంతేసి రెండుగ్లాసులు చేత్తో పుచ్చుకుని, గది చివరనఉన్న బాతురూమ్‌లోకి వెళ్ళి లైటు వేశాడు గ్లాసులు పూర్తిగా నీళ్ళతోనింపేడు,

"మైగాడ్, సూపర్ ఛిల్డ్ విస్కీ" అని బాతురూము తలుపువేసి వణకుతున్న చేతుల్తోవచ్చి బల్లమీద పెట్టేడు గ్లాసుల్ని.

ఇద్దరూ తీరుబడిగా సిప్‌చేస్తున్నారు బయట చలి. ప్రతివిస్కీగుక్కకి శరీరంలో అంచెలంచెలుగా వేడెక్కుతోంది. మత్తుగా, వేడిగా, హుషారుగా సంభాషణలు సాగుతున్నాయి.

"నేను చెప్పేనుకదా గిరిజన తండాకి వెళ్ళాలని, అక్కడొక పిక్యూలియారిటీ ఉంది. ఆగూడెం మధ్యలో "గోథాల్" అనే గుడిసెఉంటుంది. ఆగూడెంలో ఈడొచ్చి పెళ్ళికాని ఆడపిల్లలూ, మగపిల్లలూ మొత్తం ఆగుడిసెలో పడుకుంటారు. ప్రీమెరిటల్ సెక్స్‌కి అభ్యంతరం ఉండదు, అదొక మినియేచర్ సెక్స్ పెర్మిసివ్ సొసైటీ లాంటిది" అని చెపూ ఒక గుక్క విస్కీని పుక్కిలించినట్టు నోట్లో ఆడించి మింగేడు. "మరి గర్భధారణో" హుషారుగా ప్రశ్నించాడు రంగారావు "అదే ఉండదుట" ఈ విషయం ఒక స్విస్ ఏంథ్రపాలజిస్ట్‌రాశాడు ఆ పిక్యూలియారిటీ గురించి వివరాలు సేకరించడానికే అక్కడికి వెళ్తున్నాను.

కుమార్ విషయ పరిజ్ఞానానికి ఆశ్చర్యపోతున్నాడు రంగారావు. బాతాఖానీలో రకరకాల టాపిక్స్‌గురించి మాట్లాడేడు కుమార్. ఆపరేషన్ ఎంటబ్బీ గురించి, ఇరాక్ అణుకేంద్రం మీద ఇజ్రాయిల్ మెరుపుదాడి గురించీ, ప్లాటో ఐడియల్ స్టేట్, డైలెక్టికల్ మెటీరియలిజమ్, సైనిక వ్యూహరచన - ఒకటేమిటి అన్ని విషయాల్నీ హుందాగా మధ్యమధ్య చక్కటి ఇంగ్లీషు పదాలతో ఝరీప్రవాహంలా మాట్లాడుతున్నాడు.

"కుమార్‌గారూ! మీ బహుముఖ విషయ పరిజ్ఞానానికి సాజోహార్లు, మిమ్మల్ని కలుసుకోవడం నా అదృష్టం "మరీ మునగ చెట్టెక్కించేస్తున్నారు గురువుగారు. అది మాప్రొఫెషనండీ జర్నలిస్టుకి రాజకీయాలు యుద్ధం, సాహిత్యం, రంకు తతంగాలు, స్కాండల్సు ఒకటేమిటి అన్నీ తెలియాలి. తెలియకపోయినా తెలిసినట్టు మీదగ్గిర నటించాలి. మావృత్తి ధర్మం!".

"అన్నట్టు సాహిత్యమంటే గుర్తొచ్చింది. నాకు పుస్తకాలు చదవటం అంటే చాలా ఇష్టం, అదీఇదీఅనికాదు ఏచెత్త పుస్తకం కనిపించినా చదివేస్తాను.

"అయితే మీరూ జర్నలిస్టు అవుతున్నారన్నమాట" అని జోక్‌చేసి మరోగుక్క విస్కీ గల్ప్‌చేశాడు.

"ఈమధ్య పత్రికల్లో చదివే ఉంటారు. దెయ్యాలు, భూతాలు, చేతబడుల మీద తెగ కథలు, నవల్లు వస్తున్నాయి. అది సాహిత్యంలో ఆరోగ్యకరమైన విషయం అంటారా?"

"రానీయండిసార్, బూతు కథలు, రేప్‌కథలు. అలాగే దెయ్యాల కథలూకూడా రానీయండి. పాపం అవేం తప్పుచేశాయి. జర్నలిస్ట్‌గా నా అభిప్రాయం చెప్పమంటారా? సాహిత్యానికి సంకెళ్ళు వేసే అధికారం ఎవరికీ ఉండకూడదు. మంచి సాహిత్యమైతే నాలుగు కాలాలపాటు నిలుస్తుంది. చెత్తయితే కొట్టుకుపోతూంది. దానిగురించి ఎందుకింత రాద్ధాంతం. విశ్వకవి రవీంద్రనాథ్ "క్షుదితపాషాన్"లో దెయ్యాలులేవూ, సత్యజిత్ రే "మొనిహార్" దెయ్యం సినిమా కాదూ, షేక్స్పియర్ నాటకాల్లో దెయ్యాలూ, భూతాలు, మంత్రకత్తెలూ లేరూ - వాటికి విలువలేదూ?"

"దెయ్యాలు ఉన్నాయంటారా? అవి అభూతకల్పనలు కావూ".

"దేవుడు ఉన్నాడంటారా? అదీ అభూత కల్పనకాదూ" అని ఎదురు దాడి చేశేడు కుమార్. "ప్రస్తుతం సైన్సు కందని ప్రతీ విషయాన్ని మనం కాదని కొట్టిపారేయటానికి వీలులేదంటాను నేను. ఆ సబ్జక్ట్ బియాండ్ ది డైమన్షన్ ఆఫ్ సైన్స్. రేపు సైన్సే నిరూపించవచ్చు. మీరు దెయ్యాల సాహిత్యాన్ని ఖండిస్తే, మరో నాస్తికవాది దేవుడి సాహిత్యాన్ని ఖండించాలంటాడు. కాంగ్రెస్‌వాళ్లు కమ్యూ

(57వ పేజీ తరువాయి)

విష్టు సాహిత్యాన్ని బహిష్కరించమంటారు. కమ్యూనిష్టులు కాంగ్రెస్ కుహనా సంస్కార సాహిత్యాన్ని అంతం చెయ్యాలంటారు. ఇలా ఎక్కడ తేలగలం. అందువల్ల అన్ని రకాల సాహిత్యాలు ఉండనివ్వండి. మరేం ఫర్వాలేదు. లెట్ గో'' అని ఏకబిగిని లెక్చరుదంచి విస్కీ పూర్తి చేశాడు.

రంగారావు కూడా గ్లాసుపూర్తి చేసి ఏమోనండి. మీలాంటి మేధావులైన జర్నలిష్టులుకూడా ప్రజలని పెడ దారిని పట్టించే కాల్పనిక చెయ్యపు సాహిత్యాన్ని వెనకేసు కొస్తున్నారంటే బాధగాఉంది''.

'కుమార్ పక్కున నవ్వేడు "టేకిట్ ఈజీ - ఐయామ్ సారీ ఐ హేస్ హర్ట్ యువర్ ఫీలింగ్స్''.

"నోనో! మంచివారే! ఎదో కాల క్షేపానికి ఈ చర్చగానీ నేను సీరియస్‌గా తీసుకోలేదు సుమండీ. చాలా రాత్రయింది పడుకోండి సార్. చాలా దూరం తిరిగి అలసిపోయుంటారు.' రేపుదయాన్నే మళ్ళీ మీరు బయలుదేరాలి".

"మీపుణ్యమా అంటూ హాయిగా నిద్రపోతాను, లేకపోతే బయట చలిలో చచ్చేవాణ్ణి. చలిలో విస్కీహాయిగా ఉంది కదూ - చిన్న వేడి - స్ప్లెండిడ్-గుడ్ నైట్ పడుకోండి." అన్నాడు కుమార్ మంచం మీద మేను వాలుస్తూ.

"వెరీగుడ్ నైట్, మీకు ముందుగా తెలివొస్తే లేపండి" అని రగ్గుకప్పుకోబోతూ అరే బాత్‌రూమ్‌లో లైటు వెలుగుతోందే. ఆర్పేస్తానుండండీ'' అంటూ రంగారావు లేవబోయాడు.

"నోనో! మీరు పడుకోండి, నేను ఆర్పేస్తాను" అంటూ మత్తుగా ఒళ్లు విరుచుకొని, ఆవలించి బాత్‌రూమ్‌వైపుకి చెయ్యి చాచాడు కుమార్.

చెయ్యిసాగుతోంది!...... ముందు ముందుకి అలా సాక్కుంటూపోతోంది!... ఇంకా ఆచెయ్యి అలాసాగుతూ బాత్‌రూమ్ వైపు పోతోంది......

రంగారావు షాక్‌తో మంచుగడ్డలా ఘనీభవించి పోతున్నాడు.

అలా సాగుతూ పోయిన చెయ్యి బాత్‌రూమ్‌తలుపు తోసుకొని స్విచ్‌ని వెతుకుతోంది క్లిక్......స్విచ్ ఆఫ్

చీకటి

— ❋ —

(66వ పేజీ చూడండి)

*With best compliments from*

# SARVANI PRINTERS

***Quality Printers & Publishers***

★

**31-32-64, Dabagardens,**

**VISAKHAPATNAM-530 020**

# రోజులు మారాలి

స్వతంత్ర్యం సంతరించుకుని యిన్నేళ్ళయినా, భిన్నత్వంలో ఏకత్వం వున్న గొప్పదేశంగా మనం మురిసిపోయే మన స్వతంత్ర్య భారత దేశంలో యింకా కులమత భేదాల జాడ్యం సమసిపోలేదు. ఇవి మనిషికీ మనిషికీ మధ్య ఆరనిజ్వాలలను సృష్టిస్తూ, సమాజాన్ని అల్లకల్లోలం చేస్తున్నాయి. అఖండ భారతదేశం ఐక్యతని తునా తునకలు చేస్తున్నాయి. ఈ దేశం ఎప్పుడు బాగు పడుతుంది? భావాత్మక ఐక్యత, సమదృష్టి, మతపరమైన సంకీర్ణ భావాలనుండి విముక్తి ఎప్పుడు వస్తాయి? సర్వతోముఖ దేశాభివృద్ధికి కావలసిన సుహృద్భావ వాతావరణం ఎప్పుడు ఏర్పడుతుంది? ఈ ప్రశ్నలకు అందమైన జవాబులా, వాస్తవికతకు అతి చేరువగా చిత్రించబడిన చిత్రం జయశ్రీ చిత్రహారి 'రోజులు మారాలి'

ప్రభ, చంద్రమోహన్, ముఖ్య పాత్రధారులు. ఈచిత్రంలో యింకా నూతన్‌ప్రసాద్, మాడా, రాళ్ళపళ్ళి, రమణమూర్తి, కాంతారావు, శివకుమార్ తదితరులు నటించారు. కథ: వాశిరాజు ప్రకాశం. సంగీతం: ఎస్ రాజేశ్వరరావు. నిర్మాణ నిర్వహణ: కె. యం. నాయుడు. దర్శకత్వం - కనకాల దేవదాస్. నిర్మాత: వాశిరాజు ప్రకాశం సమర్పణ: యస్. యస్. మూర్తి

స్విచ్ ఆఫ్ (61వ పేజీ తరువాయి)

ఇలాంటి ముగింపుగల కథలు ఇంతకు ముందెప్పుడైనా చదివినట్టు అనిపిస్తోందా? అయుండొచ్చు- ఎందుకంటే దెయ్యాల కథల ముగింపులన్నీ ఇంచుమించు ఒకేలా ఉంటాయి. -రచయిత

# వయ్యారి భామలు - వగలమారి భర్తలు

కట్టా సుబ్బారావు దర్శకత్వంలో 'వయ్యారి భామలు-వగలమారి భర్తలు' చిత్రం తయారు కాబోతూవున్నది. ఎన్. టి రామారావు. శ్రీదేవిపై ఈ చిత్రం కోసం వేటూరి వ్రాసిన ఒక పాటను రికార్డు చేశారీమధ్య. సంగీతం రాజన్ నాగేంద్ర 'మేఘాల పందిరి లోన...' పల్లవితో మొదలైన ఈ పాట పి. సుశీల పాడగా, జెమినీలో రికార్డు చేశారు.



ఇంద్రుడు - చంద్రుడులో మంజుభార్గవి, శరత్‌బాబు